పంద్రాగస్టుకు పచ్చని స్వాగతం...



కడియం పల్ల వెంకన్న నర్సరీలో మొక్కలతో పంద్రాగస్టుకు ఇలా స్వాగతం పలికారు. ప్రముఖ ల్యాండ్ స్కేపింగ్ డిజైనర్ పల్ల వెంకన్న నర్సరీ డైరెక్టర్ పల్ల వెంకటేష్ వీటిని కూర్చారు.

నిధులు కేటాయిస్తారా..?

- గత సర్కారు హయాంలో దారి మళ్లిన సంక్షేమ బోర్డు సొమ్ములు
- నేటికీ పెండింగ్‌లో వేలాది క్లెయిమ్‌లు
- కూటమి ప్రభుత్వ పరిష్కరిస్తుందని ఆశలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కేంద్రంతో పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని వైసిపి ప్రభుత్వం పూర్తిగా కాలరాసింది. రూ.వందల కోట్ల సంక్షేమ బోర్డు నిధులను దారి మళ్ళించి కార్మికులకు తీరని అన్యాయం చేసింది. సంక్షేమ బోర్డును నిలుపుదల చేస్తూ 2021 సెప్టెంబరులో మెమో 1214ను తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో కూటమి సర్కారు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని, పెండింగులో ఉన్న పరిహారాలను తక్షణమే చెల్లించాలని కార్మికులు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఉమ్మడి



తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం, పిఠాపురం, సామర్లకోట, అమలాపురం, తుని, మండపేట తదితర పట్టణాలపాటు అన్ని ప్రాంతాల్లో భవన, ఇతర నిర్మాణాలపై ఆధారపడి 53 రకాల పనులు చేస్తూ సుమారు 5 లక్షల మంది కార్మికులు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

వైసిపి పాలనలో పరిష్కారం కాని క్లైములు

2019లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత నూతన ఇసుక పాలసీను తీసుకొచ్చి కార్మికులకు ఉపాధి లేకుండా చేశారు. లక్షలాది మంది జీవనోపాధిని దెబ్బతీశారు. అంతే కాకుండా సంక్షేమ బోర్డు నిధులను దారి మళ్ళించారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు మళ్లించిన రూ.2,450 కోట్లను తిరిగి సంక్షేమ బోర్డుకు జమ చేయాలని భవన నిర్మాణ రంగ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేసినా జగన్ సర్కారు కనీసంగానైనా పట్టించుకోలేదు. సంక్షేమ బోర్డునే నిలుపుదల చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది క్లైములు పెండింగ్‌లో ఉండిపోయాయి.

రూ.5.62 కోట్ల పరిహారాలు పెండింగ్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2019 నుంచి 196 మంది సహజ మరణం పొందగా వీరికి రూ.76.80 లక్షలు, 8 మంది ప్రమాదాల్లో మరణించగా రూ.37.20 లక్షలు, 46 మంది అనారోగ్యంతో హాస్పిటల్లో చికిత్స పొందుతుండగా రూ.4 లక్షలు, 1868 మంది ప్రసూతి పరిహారాలకు రూ.3.73 కోట్లు, 229 మంది అంత్యక్రియలు ఖర్చులు రూ.45 లక్షలు, 105 మందికి పెళ్లి కానుకగా రూ.18 లక్షలు, శాశ్వత అంగవైకల్యం పొందిన ముగ్గురికి రూ.7.50 లక్షలు మొత్తంగా 2454 మందికి రూ.5.62 కోట్ల పరిహారాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. కార్మికులకు ఎటువంటి ప్రమాదాలు జరిగినా సంక్షేమ బోర్డు నుంచి ఒక్క రూపాయి కూడా పరిహారం అందడం లేదు. మరోవైపు దరఖాస్తు పెట్టుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయింది.

అనేక పోరాటాలు

దారి మళ్లించిన సంక్షేమ బోర్డు నిధులను తిరిగి జమ చేయాలని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని తదితర డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ రంగ కార్మికులు దశల వారీ పోరాటాలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు చేసి వినతి పత్రాలు అందజేశారు. అనేక రూపాల్లో నిరసనలు వ్యక్తం చేశారు. సమస్యలతో కూడిన లేఖలను అందరి ప్రజాప్రతినిధులకు అందజేశారు. తహశీల్దార్ కార్యాలయాల వద్ద కూడా ధర్నాలు చేశారు. మంత్రుల ఇళ్లను ముట్టడించారు.

ప్రభుత్వం తక్షణమే స్పందించాలి



గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి చేసిన అన్యాయాన్ని ఎదిరించి కూటమి ప్రభుత్వానికి భవన నిర్మాణ రంగ కార్మికులు సంపూర్ణ మద్దతు తెలిపి గెలిపించారు. కానీ కొత్త ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు దాటుతున్నా పెండింగ్ క్లయముల చెల్లింపునకు అడ్డంకిగా ఉన్న 1214 మెమొను రద్దు చేయకుండా కాలయాపన చేస్తోంది. తక్షణమే సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పెండింగ్ క్లైములను తక్షణమే పరిష్కరించాలి.

- సిహెచ్.రాజ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి, సిఐటియు, కాకినాడ

'ఉపాధి' పని కల్పించకపోతే ఉద్యమం

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-అమలాపురం

ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చి నిధులు దారి మళ్లించి కూలీలకు పనులు లేకుండా చేస్తే మరో ఉద్యమం తప్పదని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అమలాపురం స్థానిక వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో తాడి శ్రీరామ్‌మూర్తి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం గ్రామ సభల ద్వారా ఉపాధి హామీ చట్టంలో పనులు గుర్తించి పనులు కల్పించడం కోసం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని తెలియజేసింది. దీన్ని స్వాగతిస్తున్నామని అయితే ఇదే క్రమంలో ఉపాధి హామీ చట్టంలో మెటీరియల్ కాంపోనెంట్ పెంచుతూ సిమెంటు కాంక్రీట్ పనులు చేస్తూ కూలీలకు పనులు లేకుండా చేస్తే ఊరుకునేది లేదన్నారు. మెటీరియల్ కంపొనెంట్ పెరగకుండా పనులు గుర్తించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే గతంలో తొలగించిన గుర్రపు డెక్క, మట్టి పని, జంగిల్ క్లియరెన్స్ లాంటి పనులు ఉపాధి చట్టంలో పనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏట గ్రామసభలు జరిపి ఆ గ్రామంలో ఉపాధి హామీ చట్టం కింద ఏఏ పనులు చేపట్టాలి, ఎన్ని కుటుంబాలకి, ఎన్ని వర్కింగ్ డేస్ ఇవ్వాలి అని గ్రామ సభల ఆమోదంతో పనుల ఎంపిక చేస్తారని ఆ పనులని ఉపాధి హామీ ద్వారా సంవత్సరం మొత్తం చేయాలనీ ఇందులో కూలీలతో చేయాల్సిన పనిని పక్క దారి పట్టించి యంత్రాలతోనూ, సిమెంటు పనులకు, నిధులు మళ్లించి కూలీలకు తగినన్ని పనులు ఇవ్వడంలేదని వాపోయారు. ఈ సంవత్సరం ఒకేసారి 13వేల పైగా పంచాయతీల్లో గ్రామ సభలు జరిపి ఆ గ్రామంలో ఉపాధి హామీ ద్వారా ఏ ఏ పనులు చేపట్టాలని గ్రామసభల ద్వారా నిర్ణయిస్తామని మంత్రి ప్రకటించారన్నారు. గ్రామసభలలో ఉపాధి హామీ కూలీలు చేయాల్సిన పనుల కంటే యంత్రాలతోనూ కాంట్రాక్టర్లు, సిమెంటు రోడ్లు, హార్టికల్చర్ కు మళ్లించే అవకాశం ఉందని ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తెలియజేశారు. ఇటువంటి నిర్ణయం కనుక ప్రభుత్వం చేయాలనే ఆలోచనని తక్షణం వెనక తీసుకోవాలని లేని పక్షంలో ఉద్యమం తప్పదని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పొలమూరి శ్రీనివాసరావు, భీర వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కారెం వెంకటేశ్వరరావు

సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలిగా రమణకుమారి

ప్రజాశక్తి -మామిడికుదురు

మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలిగా నగరం గ్రామ సర్పంచ్ జాలెం రమణకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్పంచుల సమావేశం లో ఆమెను సర్పంచ్‌లంతా సమాఖ్య అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. ప్రస్తుత సమాఖ్య అధ్యక్షులు లూటుకుర్రు సర్పంచ్ అడబాల రామ సత్య నారాయణ(తాతకాపు)పి.గన్నవరం నియోజకవర్గ సమాఖ్య అధ్యక్షునిగా కొనసాగుతున్నందున ఈ ఎన్నిక నిర్వహించారు. అనంతరం ఆమెను టిడిపి సీనియర్ నాయకులు జాలేం సుబ్బారావు, నియోజకవర్గ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, సహచర సర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులు సత్కరించారు.



సమావేశంలో రమణకుమారిని సత్కరిస్తున్న సహచర సర్పంచులు

డ్వాక్రా ఖాతాల తరలింపునకు వినతి

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని జొన్నాడకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు తమ సొంత గ్రామంలో ఉన్న యూనియన్ బ్యాంకుకు డ్వాక్రా ఖాతాలను తరలించాలని బుధవారం స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ వై.అజయ్ ప్రభుకుమార్‌కు టిడిపి నేతలు తాడి శ్రీనివాస్ రెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్ సమక్షంలో వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ జొన్నాడలో సుమారుగా 6000 మంది జనాభా కలిగి ఉండి చిన్న, సన్నకారు వ్యాపారులు జీవిస్తున్నామన్నారు. గత 35 ఏళ్ల నుంచి ఇప్పటి వరకు సుమారు 150 సంఘాలుగా ఏర్పడి 1500 మంది సభ్యులు మండల కేంద్రమైన ఆలమూరులో గల యూనియన్ బ్యాంకులో ఖాతాలు ఏర్పరచుకుని రుణాలను పొందుతూ తగు సమయంలో బ్యాంకు వారికి సహకరిస్తూ చెల్లింపులు జరుపుతున్నామన్నారు. అయితే 2016లో మా గ్రామంలో ప్రజల అవసరాలను తెలుసుకొని యూనియన్ బ్యాంక్ వారు నూతన బ్రాంచ్ ని ప్రారంభించి నప్పటికీ తగు ప్రయోజనం డ్వాక్రా సంఘాలకు లభించలేదన్నారు. డ్వాక్రా వాయిదాల నగదు చెల్లించడానికి మహిళలు, ఆలమూరు చేరుకోవడానికి సరైన రవాణా సౌకర్యములు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ సమస్యను పలుమార్లు బ్యాంకు వారికి తెలియజేసినప్పటికీ పరిష్కార మార్గం లభించలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మా సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో సత్తి శ్రీనివాసరెడ్డి(మాచవరం శ్రీను), సత్తి శ్రీనివాసరెడ్డి, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలతో పాలగుమ్మి విద్యార్థులు

జీవ వైవిధ్య పోటీల్లో 'పాలగుమ్మి' విద్యార్థులకు తృతీయ బహుమతి

ప్రజాశక్తి అమలాపురం రూరల్

ఎపి జీవవైవిధ్యము పోటీల్లో అమలాపురం మండలం పాలగుమ్మి జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ బహుమతి సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు గుంట్రు వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న జెడ్పి బాయ్స్ హైస్కూల్ అమలాపురం నందు ఎపి స్టేట్ జీవవైవిధ్యం బోర్డ్అండ్ ఎపి ఎన్‌జిసి వారి ఆధ్వర్యంలో డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సహకారంతో జిల్లా స్థాయి పోటీలు వకత్వం, క్విజ్, షార్ట్ ఫిలిం విభాగాల్లో రోల్ఆఫ్ యూత్ ఇన్ బయో డైవర్సిటీ కాన్వర్జేషన్ అనే అంశంపై నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల పాలగుమ్మి విద్యార్థులు షార్ట్ ఫిలిం విభాగంలో తృతీయ బహుమతి సాధించారు. వక్తృత్వం, క్విజ్ పోటీల్లో పాల్గొని ప్రశంసాపత్రాలు అందుకున్నారు. షార్ట్ ఫిలిం విభాగంలో తృతీయ బహుమతి సాధించిన టెన్త్‌కి చెందిన డి.రీనా అలేఖ్య, ఎం.మోహిత లక్ష్మీ సౌమ్య, బి.విమల దుర్గ, ఎం.లక్ష్మీ సౌమ్య, జి.వైశాలి, గైడ్ టీచర్ ఎబి.చంద్రావతి ఎస్ఎ(బిఎస్)లను ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది తదితరులు ఈ సందర్భంగా అభినందించారు.



పవిత్రోత్సవాలలో పాల్గొన్న ఆలయ డిసి

ఘనంగా శ్రీవారి పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

తిరుమల తరహాలో వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు బుధ వారం ఘనంగా ప్రారంభమ య్యాయి. పండితులు కండవల్లి ప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి ఉదయం సంకల్పం విశ్వక్సేన, పుణ్యాహవచనము, రుత్విక్ వరుణ తదితర పూజలు నిర్వహించారు. ఆలయ డిసి భూపతి రాజు కిషోర్ కుమార్ పవిత్రోత్సవాల కార్యక్రమంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. మూడురోజులపాటు ఈకార్యక్రమాలను చూసేందుకు రాష్ట్ర నలుమూల నుంచి యాత్రికులు రానున్నాయరు. వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

నిర్ణీత కాల వ్యవధిలోపే అనుమతి

కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల కమిటీ సమావేశం

ప్రజాశక్తి-అమలాపురం

పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అందజేసిన దరఖాస్తులను పరిశీలించి, నిర్ణీత కాలవ్యవధిలోపే వాటికి అను మతులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ 11 వ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు అంశాల మీద సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ నుంచి 2024 ఆగస్టు వరకు సింగిల్ డెస్క్ విధానం కింద పరిశ్రమల స్థాపన క్లియరెన్స్ కొరకు జిల్లాలో 176 దరఖాస్తులు అందాయన్నారు. వీటిలో 163 దరఖాస్తులకు క్లియరెన్స్ ఇచ్చారన్నాయరు. ఆరు దరఖాస్తులు మార్గదర్శకాల ప్రకారం లేని కారణంగా రిజెక్ట్ చేసామనీ తెలిపారు. ఏడు దరఖాస్తులకు అనుమతులు ఇవ్వాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకే పి.ప్రసాద్, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ శివ శంకర ప్రసాద్, కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, డిస్టిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ అశోక్ ప్రతాప్‌రావు, జిల్లా ఉద్యానవన అధికారి బివి.రమణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

రావులపాలెంలోని 21వ తేదీన సత్యసాయి విద్యా సంస్థల ప్రాంగణం లో వికాస వారిచే నిర్వహిస్తున్న జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు వివిధ కంపెనీలకు సంబంధించి పోస్టులు వివరాలను తెలుపుతూ కరపత్రాన్ని విడుదల చేశారు.

'శ్రేష్ట'లో పినపల్ల విద్యార్థికి ఆలిండియా ర్యాంకు

ప్రజాశక్తి-ఆలమూరు



సత్య వెంకట ప్రకాష్

పినపళ్ళకు చెందిన తోట రాజు, మహారాణి దంపతుల కుమారుడు తోట సత్య వెంకట ప్రకాష్ 'శ్రేష్ట' స్కీమ్ ద్వారా ఆలిండియా స్థాయిలో ప్రతిభ కనబరిచాడు. ఈ మేరకు స్కీమ్ ఫర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ స్టూడెంట్స్ ఇన్ హైస్కూల్స్ ఇన్ టార్గెటెడ్ ఏరియాస్ స్కీం-2024 పోటీ పరీక్షల్లో ఆలిండియా 1950 ర్యాంకు సాధించానని విద్యార్థి ప్రకాష్ బుధవారం తెలిపారు. ఇదంతా మా తల్లిదండ్రులు ప్రోత్సాహంతో శ్రేష్ట స్కీమ్‌కి స్వతహాగా ఆన్లైన్లో అప్లై చేసి మంచి ర్యాంక్ సాధించానన్నాడు. కొత్తూరు సెంటర్ లో ఉన్న శ్రీవిద్య పబ్లిక్ స్కూల్ నందు పదవ తరగతి పూర్తి చేసానన్నాడు. విజయనగరం జిల్లా, బొట్ల పాలెం మండలం, గోట్లం గాయత్రీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అండ్ కాలేజ్ నందు ఇంటర్మీడియెట్ సిబిఎస్ఇ ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్య అభ్యసించే అవకాశం లభించిందని వివరించారు. ఆలిండియా ర్యాంకు సాధించిన విద్యార్థిని, శ్రీవిద్య స్కూల్ అధినేత ఆదినారాయణ, సర్పంచ్ సంగీత సుభాష్, ఎంపిటిసి సభ్యుడు పట్టాభి రామన్న, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-ఐ.పోలవరం

మురమళ్ల గ్రామ పంచాయతీ పరిధిలో జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం విద్యాకమిటి చైర్మన్ విత్తనాల సత్యమూర్తి పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనంచేసి రుచి చూశారు. అనంతరం మిడ్డే మీల్స్ కార్మికులతో మాట్లాడి వారిసమస్యలు తెలుసుకున్నారు.

కపిలేశ్వరపురం తహశీల్దార్‌గా చిన్నారావు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం తహశీల్దార్‌గా పైడి చిన్నారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయన రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని తహశీల్దారుగా పనిచేసి తిరిగి కపిలేశ్వరపురం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ రాజరాజేశ్వరి పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన చిన్నారావుకు డిటి కె.వెంకటేశ్వరరావు, ఆర్ఐ శ్రీనివాస్, విఆర్ఒలు, కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.



తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన చిన్నారావు

సర్పంచులకు, కార్యదర్శులకు ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి -యంత్రాంగం

జిల్లాలో సర్పంచులకు, కార్యదర్శులకు గత మూడు రోజుల నుంచి పలు అంశాలపై నిర్వహిస్తున్న శిక్షణ బుధవారంతో ముగిసింది.

ఆలమూరు: సర్పంచులకు, కార్యదర్శులకు రిఫ్రెషర్ శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈనెల 12 నుంచి 14 వరకు వరకు మండల పరిషత్ కార్యాలయం నందు మండల అభివృద్ధి అధికారిని ఎ.మేరీ రోజ్, విస్తరణాధికారులు రాజ్ కుమార్, ఎఒ రామ్ స్వరూప్ పర్యవేక్షణలో మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారందరికీ సర్టిఫికెట్లను అందజేశారు.

మామిడికుదురు: గ్రామాల అభివృద్దే లక్ష్యంగా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పనిచేయాలని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ అన్నారు మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కుసుమ వనజ కుమారి అధ్యక్షతన ఎంపిడిఒ వేణుగోపాలరెడ్డి పర్యవేక్షణలోబుధవారం జరిగిన సర్పంచులు, కార్యదర్శులు అవగాహన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో పరిపాలనాధికారి కారుపల్లి వెంకటేశ్వరరావు, ఇఒపిఆర్‌డి అడబాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: సర్పంచులు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. కార్యక్రమంలో ఎంపిడిఒ కొండలరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలో 19 గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, టిఒటిలు, పాల్గొన్నారు.

ఆత్రేయపురం: పంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులకు రిఫ్రెషర్ శిక్షణ కార్యాక్రమము చివరి రోజులో భాగంగా గ్రామ అభివద్ధి ప్రణాళికాపై శిక్షణిచ్చారు. ఎంపిపి కుండా అన్నపూర్ణ మాట్లాడుతూ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఇటువంటి శిక్షణను నిర్వహించడం పట్ల పంచాయతీ అభివృద్ధిపై పూర్తి అవగాహన ఏర్పడుతుందన్నారు. ఎంపిడిఒ ఎస్.వెంకటేశ్వరరావు, పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాస్ మాట్లాడారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వారికి ధృవ పత్రాలు అందజేశారు.



ఆలమూరుశిక్షణలో పాల్గొన్న సర్పంచులు, కార్యదర్శులు



కపిలేశ్వరపురంలో శిక్షణకు హాజరైన సర్పంచులు, కార్యదర్శులు




పత్రాన్ని చిన్నారి తండ్రికి అందజేస్తున్న ఎంఎల్ఎ దాట్ల

ముఖ్యమంత్రి సహాయనిధి పత్రం అందజేత

ప్రజాశక్తి-ఐ.పోలవరం

అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి ముఖ్యమంత్రి సహాయనిధిని నుంచి ఆర్థిక సాయం మంజూరైంది. ఐ.పోలవరం మండలంలోని తిల్లకుప్ప గ్రామానికి చెందిన చిన్నారి మంచిగంటి యషికకు గుండె శస్త్ర చికిత్స నిమ్మితం రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని ముఖ్యమ్యంరతి సహాయ నిధి ద్వారా మంజూరు చేయించి ఆ పత్రాన్ని బుధవారం ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు మురమళ్ల క్యాంప్ కార్యాలయం వద్ద చిన్నారికి తండ్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కడియం వెంకటేశ్వరావు, తిళ్లకుప్ప సర్పంచ్ కడియం తమ్మయ్య, విజ్జల్ రాజు, జంపన భీమరాజు, ముదునూరి రామలింగరాజు, శ్రీను రాజు, బొంతు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



కళాశాల్లో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక మార్కెట్ ప్రాంతంలోని డా.ఎంజిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం డ్రగ్స్ అనర్థాలపై విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మరియు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలు ఉచ్చు లో పడి తమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని పిలుపునిచ్చారు. అలాగే సైబర్ నేరాల పట్ల యువత అప్ర మత్తంగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులంతా స్నేహ భావంతో మెలగాలని ర్యాగింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రభాకర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కట్టా శ్రీనివాస రావు, స్థానిక ఎస్ఐ జ్వాలా సాగ, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మేజిస్ట్రేట్

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిగ దిగుబడి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

సాగులో మేలైన వ్యవసాయ పద్ధతులను అవలంబించి, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సాధించే దిశగా అధికారులు రైతులను ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ అధికారి వి. బోసు బాబు సూచించారు. నగర పంచాయతీ పరిధిలో ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల జిల్లా కార్యాలయాల ప్రాంగణంలో జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం జిల్లాలోని వ్యవసాయ సహాయ సంచాలకులు మరియు మండల వ్యవసాయ అధికారులకు, రైతు సేవా కేంద్ర సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మండలం లోనూ ఒక గ్రామాన్ని పొలంబడి గ్రామంగా ఎంపిక చేసి రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తామనారు. దీనికి సంబంధించి క్షేత్రస్థాయి అధికారులు ముందస్తు ప్రణాళికను రూపొందించుకుని వరి సేద్యం లో నూతన విధానాలను పాటించటంతో పాటు యాంత్రిక విధానంలో ఎరువులు, పురుగు మందులు వినియోగాన్ని తగ్గించే చైతన్యం తీసుకుని రావాలన్నారు. శాస్త్రవేత్త నందకిషోర్, ఆత్మా పీడీ జ్యోతిర్మయి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎడిఎలు, మండల వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో గల సత్యవాడ గ్రామానికి చెందిన కొలగారపు వీర వెంకట సత్యనారాయణ గత నెల జూలై 29 నుండి కనిపించడం లేదని అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. 16 నెలలు నుంచి మానసిక వ్యాధితో బాధ పడుతున్న సత్యనారాయణ గత నెల 29న రాత్రి సమయంలో బయటికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. అతను ఆచూకీ కనిపించలేదనిభార్య కొలగారపు వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు పై పామర్రు ఎస్ఐ జానీ బాషా కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఎటువంటి అనుమతులు లేకుండా మధ్యాహ్నం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఆత్రేయపురం రేవు సెంటర్లో వారి నుంచి రూ.2750 విలువ చేసే 18 మద్యం బాటలను స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్ శ్రీనివాస్ తెలిపారు.

దాడి సంఘటనపై కేసు నమోదు

ప్రజాశక్తి - గోపాలపురం

ఇద్దరు వ్యక్తులు కలిసి ఒక వ్యక్తిపై దాడి చేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను బుధవారం ఆయన మీడియాకు వెల్లడించారు. ఈనెల 12వ తేదీ సాయంత్రం 4 గంటలకు వెలవెల సుధాకర్, వెలవెల సత్యనారాయణ ఇరువురు కలిసి పాత కక్షను దృష్టిలో పెట్టుకుని చేతులతో, కర్రలతో వడ్లమూడి సతీష్‌పై దాడి చేసి గాయపర్చారని తెలిపారు. బాధితుడు ప్రస్తుతం ఆసుపత్రిలో చికితరిస పొందుతున్నాడని చెప్పారు. ఆసుపత్రిలో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కేసుపై కొందరు తప్పుడు వదంతులను ప్రచారం చేస్తున్నారని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గడ్డి మందు తాగి యువకుడు మృతి

ప్రజాశక్తి - కరప

కలుపు మొక్కలు నివారించే గడ్డిముందు తాగి యువకుడు మృతి చెందాడు. మండలంలోని జడ్ భావారం గ్రామంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఎస్ఐ టి.రామకృష్ణ మీడియాకు వెల్లడించారు. గ్రామానికి చెందిన పలివెల విజయకుమార్(22) ఆటో నడుపుకుంటూ జీవనం కొన సాగిస్తున్నాడు. గత 3 సంవత్సరాల క్రితం పెద్దాపురం చెందిన ఒక యువతతో పరిచయం ఏర్పడి ప్రేమగా మారడంతో వారిద్దరూ వివాహం చేసుకు నేందుకు నిశ్చయించుకున్నారు. 4 రోజుల క్రితం తను ప్రేమించిన అమ్మాయికి వివాహం జరిగిందని తెలుసుకున్న ఆ యువకుడు మనస్థాపానికి గురై ఈనెల 13వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆ యువకుడిని కుటుంబ సభ్యులు కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. బుధ వారం అతని ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షాక్ గురై వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని నీలాద్రిరావు పేటకు చెందిన గండికోట వీరబాబు(44) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. యల్లమెల్లి గ్రామంలో కూలి పని నిమిత్తం వెళ్లి వాటరు పైపులైను వేసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో బ్రేకర్ ద్వారా సిసి రోడ్డు బ్రేక్ చేయు సమయంలో ప్రమాదవశాత్తు బ్రేకర్కు కరెంటు పాసై వీరబాబు కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యువి.శివనాగబాబు తెలిపారు.


విద్యుత్ కాంతులతో సామర్లకోట పట్టణం

వీధి దీపాలకు త్రివర్ణ కాంతులు

ప్రజాశక్తి - సామర్లకోట, కాకినాడ

సామర్లకోట - పెద్దాపురం మెయిన్ రోడ్డుకు డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు త్రివర్ణ కాంతులతో కళకళ లాడుతున్నారు. అధికారులు విద్యుత్ స్తంబాలకు జాతీయ పతాకంలో ఉండే త్రివర్ణ రంగులతో ఎల్ఇడి లైట్లు ఏర్పాటు చేశారు. సామర్లకోట నుంచి పెద్దాపురం వైపు వెళుతున్న వాహనదారులను, ప్రయాణికులను కనువిందు చేశాయి.

78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కాకినాడ నగరం ముస్తాబయింది. నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ దీప కాంతులతో ధగధగ మెరుస్తున్నాయి. కాకినాడ కలెక్టరేట్ కార్యాలయాన్ని తివర్ణ పతాకం రంగులతో, విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించారు.

కట్టమూరులో పొలంబడి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కట్టమూరు వ్యవసాయ క్షేత్రంలో బుధవారం మండల వ్యవసాయ అధికారి కె. సంజయ్‌కుమార్ అధ్యక్షతన రైతులకు పొలంబడి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ నల్లి దైవకుమార్ పాల్గొని ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ ఎన్.ప్రసాద్, మాదిరెడ్డి రామకృష్ణ, పి.సుబ్బారావు, గోవిందు, పాపారావు, నాగేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు విజయదుర్గ, అమృత పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభానికి సిద్ధం

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో అన్నా క్యాంటీన్ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. బుధవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, టిడిపి నాయకులతో కలసి అన్న క్యాంటీన్ ఆధునీకరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16వ తేదీ నుంచి మెనూ ప్రకారం రూ.5లకే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు అందిస్తున్నట్టు చెప్పారు. ఈ సేవలను పేద ప్రజలు ఉపయోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, కంటే జగదీశ్, పిట్టా జానకి రామారావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


ముగింపు సందర్భంగా యాజమాన్యం ప్రతినిధులతో విద్యార్థులు

ప్రగతిలో ముగిసిన వర్క్‌షాపు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 3 రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాపు విజయవంతంగా ముగిసిందని కళాశాల ఛైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు. బుధవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'ఫుల్ స్టాక్ ఫండమెంటల్స్ క్రియేటింగ్ ఇంటరాక్టివ్ డేటా డ్రివెన్ వెబ్ అప్లికేషన్స్' అనే అంశంపై జరిగిన వర్క్‌షాపులో హైదరబాద్‌కు చెందిన బ్రెయినోవిజన్ ట్రైనర్ డి.ఓబుల్ విద్యార్థులకు వివరించారని తెలిపారు. వెబ్ అప్లికేషన్స్‌లో ఉండే వివిధ ప్రక్రియలను, ప్రాజెక్ట్ చేయుటకు అనుసరించాల్సిన ప్రణాళికలపై ఇచ్చిన శిక్షణ విద్యార్థులకు ఎంతగానో ఉపకరించిందన్నారు. విద్యార్థులలో సాంకేతిక ప్రతిభను పెంపొందించడానికి ఇటువంటి వర్క్‌షాపులు దోహదం చేస్తాయన్నారు. ఇందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ ఓబుల్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు పెంపొందించుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు సాధించడానికి ఉపయోగపడతాయని అన్నారు. డేటా సైన్స్ విభాగాధిపతి ఎంవి.రాజేష్ మాట్లాడుతూ ఇటువంటి వర్క్ షాప్ నిర్వహించుకోవడానికి తమకు అవకాశం కలిపించిన ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యానికి తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎంవి. హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరక్టర్-అకడమిక్స్, డాక్టర్ కె.సత్యనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ జి.నరేష్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణ లక్ష్యాలు పూర్తి చేస్తాం

ప్రజాశక్తి - పెద్దాపురం

యూనియన్ బ్యాంకు పరిధిలో ఉన్న 456 డ్వాక్రా(ఎస్‌హెచ్‌జి) గ్రూపులకు ప్రభుత్వం నిర్దేశించిన రూ.10 కోట్లు రుణ లక్ష్యాలను పూర్తి చేస్తామని యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రాంబాబు తెలిపారు. బుధవారం స్థానిక మెప్మా భవనంలో మెప్మా సిఎం ఎం.భ్రమరాంబ అధ్యక్షతన ఆర్‌పిలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా రుణాలు చెల్లించే గ్రూపులకు అధిక మొత్తంలో రుణాలు ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. భ్రమరాంబ మాట్లాడుతూ అర్హులైన గ్రూపులకు వేగవంతంగా రుణ సదుపాయం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌పిలు మాట్లాడుతూ టిడ్కో గృహ లబ్ధిదారుల రుణ బకాయిలు ఎస్‌హెచ్‌జిల నుంచి రికవరీ చేయటం వల్ల గ్రూపు సభ్యులతో చాలా సమస్యలు వస్తున్నాయన్నారు. దీనిపై రీజనల్ మేనేజర్ రాంబాబు మాట్లాడుతూ ఈ సమస్యను సిబ్బందితో చర్చించి పరిష్కరిస్తాన్నారు. ఈ సమావేశంలో సిఒలు శ్రీదేవి, ఉమాపార్వతి, యూనియన్ బ్యాంక్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - కాజులూరు

స్వాతంత్రోద్యమంలో జాతీయ నాయకుల పాత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బుధవారం జడ్‌పి ఉన్నత పాఠశాలలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ క్లబ్ యాక్టివిటీ లో భాగంగా క్లబ్ మెంటార్ చింతా నారాయణ మూర్తి, తాళ్ళరేవు ఉన్నత పాఠశాల మెంటార్ పి.కిషోర్ పర్యవేక్షణలో ఈ వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు వ్యాసరచన పోటీలలో ఆసక్తిగా పాల్గొన్నప్పుడే వారిలో విషయజ్ఞానం, రాత నైపుణ్యాలు మెరుగవుతాయన్నారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు సందర్భంగా గురువారం బిఐఎస్ సంస్థ అందించే నగదు ప్రోత్సాహకం, ఇతర బహుమతులు అందజేస్తారని తెలిపారు.

ఆదిత్య యూనివర్సిటీలో గెస్ట్ లెక్చర్

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో గెస్ట్ లెక్చర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెఎల్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ టి.విజయ్‌ముని పాల్గొని రియల్ టైమ్ అప్లికేషన్స్ ఆఫ్ పవర్ ఎలక్ట్రానిక్స్ అనే అంశంపై మాట్లాడారు. పవర్ ఎలక్ట్రానిక్స్ కన్వర్టర్‌తో ఎలక్ట్రికల్ వాహనాల నియంత్రణ, ఉపయోగాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ డోలా సంజయ్, ఇఇఇ విభాగాధిపతి డాక్టర్ వి.శ్రీనివాసరావు, డిప్యూటీ ప్రొ. వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అమలాపురంలో తిరంగా ర్యాలీ నిప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో అజాదీకా అమృత్ మహోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హర్ ఘర్ తిరగా ర్యాలీలు నిర్వహించారు.

అమలాపురం: కలెక్టరేట్ లో ఆజాది కా అమత్ మహోత్సవాల్లో భాగం గా జిల్లా గ్రామీణ అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలు నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీ ని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించి ర్యాలీ లో పాల్గొన్నారు. తిరంగా ర్యాలీ ని కలెక్టరేట్ నుంచి నల్ల వంతెన వరకు నినాదాలు చేస్తూ నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎం. వెంకటేశ్వర్లు, పీడీ డిఆర్‌డిఎ డాక్టర్ శివశంకర ప్రసాద్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ హెడ్ కోచ్ సురేష్ కుమార్ స్వయం సహాయక సంఘ మహిళలు, జిల్లా గ్రామీణ అభివద్ధి సంస్థ అధికారులు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ శిక్షకులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు :** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఆలమూరు శాఖా గ్రంథాలయంలో వేడుకలు నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, గ్రంథాలయాధికారి టి.నమ్మశ్శివాయ వ్యాఖ్యానించారు. **కొత్తపేట:** అజాదీకా అమృత మహోత్సవ్, హర్ఘర్ తిరంగా లో భాగంగా రెండవ రోజు రావులపాలెం డిగ్రీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. శ్రీనివాసరావు అధ్యక్షతన కళాశాల విద్యార్థిని విద్యార్థులు ,అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది కళాశాల నందు జాతీయ జెండాలను పట్టుకొని భారతదేశ పటం (ఇండియా మ్యాప్)ఆకారంలో నిలబడ్డారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్ అరుణ్ కుమార్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పేపర్ జెండాలను వినియోగించాలి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలం మెర్లపాలెం గ్రామంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ విద్య శాఖ మరియు అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు పేపర్ జెండాల తయారీ వర్క్ షాప్ ను నెంబర్ వన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గ్రామ సర్పంచ్ మెర్ల శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో ప్లాస్టిక్ జెండాలు మాని పేపర్ జెండాలు వినియోగించాలని పర్యావరణాన్ని రక్షించి మన దేశభక్తిని చాటుకోవాలన్నారు. అనంతరం చిన్నారులు 7.8 సెంటీమీటర్ల జెండా నుంచి 78 సెంటీమీటర్ల 78 పేపర్ జెండాలను సొంతంగా తయారు చేసి హర్ ఘర్ తిరంగ్ లో భాగంగా ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు వీరబాబు, నెంబర్ వన్ పాఠశాల చైర్మన్ శ్రీను గ్రామ పెద్దలు రామకష్ణ, లక్ష్మీపతి, నాగరాజు,లోవరాజు,ఉపాధ్యాయులు శ్యామ్, ఆర్‌వివి.ప్రసాద్, కుమారి, రాజ్యలక్ష్మి, హై స్కూల్ పిఇటి తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** అంగర శ్రీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులు 78 వ ఆకారంలో నిలుచుని తమ దేశభక్తిని చాటుకున్నారు. బుధవారం స్థానిక సిద్ధార్థ కళాశాల మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు మువ్వన్నెల జెండాను చేతబట్టి దేశ కీర్తిని కొనియాడారు. కళాశాల డైరెక్టర్ వాకా పరమేశ్వర, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకోవాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - కోటనందూరు


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంఎల్ఎ దివ్య

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకోవాలని ఎంఎల్ఎ యనమల దివ్య పిలుపునిచ్చారు. బుధవారం తుని పట్టణంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకను పురష్కరించుకుని విద్యార్థులు .జాతీయ జెండాలను చేతబూని అల్లూరి సీతారామ రాజు, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్, గాంధీ వేషధారణలతో ర్యాలీ నిర్వహించారు. రాజా గ్రౌండ్ నుంచి తుని గొల్లప్రోలు సెంటర్ వరకూ సాగిన ఈ ర్యాలీని ఎంఎల్ఎ దివ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహనీయుల త్యాగాలను గుర్తుకు తెచ్చుకుంటూ వారి ఆశయాల సాధనకు కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ రాజా అశోక్‌బాబు, యనమల రాజేష్, మాజీ ఎంపిపి దంతులూరి చిరంజీవరాజు, మున్సిపల్ మాజీ ఛైర్మన్లు ఇనుగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి, టిడిపి నాయకులు సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్ పాల్గొన్నారు.

రాజా ఆశయ సాధనకు కృషి: ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఏలేశ్వరం, రౌతులపూడి


ఏలేశ్వరంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

కీర్తిశేషులు వరుపుల రాజా ఆశయ సాధనకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. బుధవారం రాజా 49వ జయంతి పురస్కరించుకుని ఏలేశ్వరంలో బొదిరెడ్డి గోపి స్వగృహం వద్ద పేదలకు దుప్పట్లు అందచేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. భవిత కేంద్రంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో రాజా ఆధ్వర్యంలో సదరన్ క్యాంపులు నిర్వహించి దివ్యాంగులకు ద్రవపత్రాలు, జాబ్ మేళాలు నిర్వహించారని గుర్తు చేశారు. అనంతరం ప్రత్తిపాడులో భారీ కేకు కట్ చేసి సంక్షేమ వసతి గృహం విద్యార్థులకు టివి అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ వరుపుల తమ్మయ్య బాబు, ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణస్వామి పాల్గొన్నారు. అలాగే రౌతులపూడి ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజా తనయుడు సాయితర్షిత్, స్థానిక టిడిపి నాయకులతో కలిసి పాల్గొన్నారు. అలాగే ములగపూడి. రౌతులపూడిలో ఉన్న వసతి గృహాలకు టివిలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గంటిమల్ల రాజ్యలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు సత్యనారాయణ, మాజీ ఎంపిపిలు పైల సాంబశివరావు. భాస్కర్‌బాబు, వైద్యాధికారి జానకిదేవి పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వాడకం హానికరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మత్తు పదార్థాల వినియోగం హానికరమని సిడిపొ మాధవి అన్నారు. బుధవారం నిషా ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా పటవల పైడా ఇంజనీరింగ్, సుంకరపాలెం ప్రకాష్ జూనియర్, తాళ్లరేవు జూనియర్ కళాశాలల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయా సదస్సుల్లో ఆమె మత్తు పదార్థాలను సేవించడం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. మాదకద్రవ్య రహిత భారతదేశం కొరకు కృషి చేయాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మాత శిశు సంక్షేమ శాఖ విస్తరణాధికారులు లలితా నిర్మల, నిభావని, సత్య నళిని, అంగన్‌వాడీ కార్యకర్తలుపాల్గొన్నారు.

సోలార్‌తో విద్యుత్ ఆదా

ఉండ్రాజవరం : మండల ప్రజలు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా తమ గృహావసరాల కరెంటు బిల్లులను భారీగా తగ్గించుకోవచ్చని ఎలక్ట్రికల్ ఎఇ ఎన్.దొరబాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ గృహ వినియోగదారులు ప్రస్తుతం నెలవారీ బిల్లు సుమారు రూ.వెయ్యి చెల్లించే వారైతే రూఫ్ టాప్ ఏర్పాటు ద్వారా ఏడాది బిల్లులో సుమారు రూ.8000 ఆదా అవుతుందన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా సబ్సిడీపై లభించే సోలార్ రూఫ్ టాప్ 3 కిలో వాట్ సామర్థ్యం గలది ఇంటికి ఏర్పాటు చేసుకుంటే ఉత్పత్తి అయ్యే విద్యుత్తును తమ ఇంటి అవసరాల నిమిత్తం వాడుకోగా, అదనపు విద్యుత్తును ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. తద్వారా విద్యుత్తు వినియోగదారుడే ఉత్పత్తిదారుడుగా తయారవుతారన్నారు. ఈ పథకానికి బ్యాంకులు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తాయన్నారు. సబ్సిడీ లభించడం ద్వారా సుమారు సగం ధరకే సోలార్ విద్యుత్ రూఫ్ టాప్ లభిస్తుందన్నారు. ఎపి ఇపిడిసిఎల్ వెబ్‌సైట్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ 'రక్షణ ప్రతిజ్ఞ'

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహారాణి కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జ్యోతిర్మయి 78 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారతదేశ అభివృద్ధి, స్వావలంబన, జాతీయ సమగ్రత, వైవిధ్య పరిరక్షణ, భిన్నత్వంలో ఏకత్వం పరిరక్షణకు అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జాస్తి రమేష్ పాల్గొన్నారు.

స్కిల్ హబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేస్తున్న స్కిల్ హబ్ లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారి పి.లోక్‌మాన్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో స్కిల్‌హబ్ ల ఏర్పాటు ద్వారా నిరుద్యోగ యువత ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామనిబుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కొరకు స్థానిక పరిశ్రమల శాఖ సహకారంతో ప్రస్తుతం ఉన్న నూతన సాంకేతికాలను ఉపయోగించి పరిశ్రమలలో నైపుణ్యత గల ఉపాధ్యాయులచే శిక్షణిస్తామన్నారు. శిక్షణ పూర్తయిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఫేజ్.2 లో భాగంగా మండపేట నియోజకవర్గం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ద్విచక్ర వాహనములు మరమ్మతులు, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్టు కోర్సులకు సంబంధించి శిక్షణ ఇస్తున్నామన్నారు.దీనికి కనీసం 8వ తరగతి పాస , అంతకన్నా ఎక్కువ చదివిన వారు ఈ శిక్షణకు అర్హులన్నారు. ఇతర వివరాలకు సెల్ నెం. 8099 183854 ను సంప్రదించాలని అన్నారు.


బాలబాలాజీ స్వామి శయన మందిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ

ఆలయ అభివృద్ధికి సహకారం అభినందనీయం

ప్రజాశక్తి-మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి ఆలయ అభివృద్ధిలో దాతల సహకారం అభినందనీయమని పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. దేవస్థానములో అప్పనపల్లి వాసులు మద్దుల పుల్లేశ్వరావుగుప్తా సావిత్రి దంపతులు ఆర్థిక సహాయంతో నిర్మించిన స్వామివారి పవళింపు సేవకు ఉయ్యాల మరియు అద్దాల మండపంను బుధవారం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో పి గన్నవరం నియోజకవర్గం టిడిపి కన్వీనర్ ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ నామన రాంబాబు, మండల టిడిపి అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, మండల బిజెపి అధ్యక్షులు మెండ ఆదినారాయణ, ఆలయ సహాయ కమిషనర్ గ్రంధి మాధవి మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల కార్మికులను పనిలోకి తీసుకోవద్దు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

18 సంవత్సరాల్లోపు బాల కార్మికులను పనిలోకి తీసుకోరాదని, అలా తీసుకుంటే చట్ట ప్రకారం జైలు శిక్షతో పాటు జరిమానాకు బాధ్యులవుతారని మండపేట సహాయ కార్మికాధికారి శివ నాగ మల్లేశ్వరరావు అన్నారు. బుధవారం కపిలేశ్వరపురం మండలంలోని అంగర, టేకి, కపిలేశ్వరపురం పరిసర ప్రాంతాల్లో కార్మికులను గుర్తించేందుకు కార్మిక, పోలీసు, విద్య, ఐసిడిఎస్ తదితర బృందాలతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు పిల్లలు తప్పకుండా చదువు కోవాలని పనికి అనుమతించరాదని తెలిపారు .

యానాం వార్తలు


కార్మికులతో మాట్లాడుతున్న మల్లాడి కృష్ణారావు

రిక్షా కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - యానాం

రిక్షా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావును డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రిక్షా డ్రైవర్ల యూనియన్ సభ్యులు కోరారు. తక్షణమే స్పందించిన మల్లాడి కృష్ణారావు రిక్షా కార్మికుల యూనియన్ బిల్డింగ్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రిక్షా కార్మికులు మాట్లాడుతూ తమ యూనియన్ బిల్డింగ్‌కు సంబంధించి టైల్స్, పెయింటింగ్ తదితర మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. డ్రైయినేజీపై ఐరన్ గ్రిల్స్ వేసినట్లయితే రిక్షాలు వెనుకకు పెట్టుకోవడానికి వీలవుతుందని తద్వారా రోడ్డు మీద వెళ్తున్న వాహనాదారులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని వివరించారు. కార్మికుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పిడబ్ల్యుడి ఎఇ కాళ్ళ నాగరాజును పిలిపించి మాట్లాడారు.

యానాంకు మంత్రి లక్ష్మీనారాయణన్ రాక

ప్రజాశక్తి - యానాం

స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియంలో గురువారం జరిగే 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు పుదుచ్చేరి ప్రజా పనుల శాఖ మంత్రి కె.లక్ష్మీనారాయణన్ రానున్నట్లు ఆర్ఎఒ మునిస్వామి తెలిపారు. బుధవారం రాత్రి తొమ్మిది గంటలకు అతిథి గృహం వద్దకు చేరుకుంటారన్నారు.

దేవస్థానాల చైర్మన్ అభ్యర్థుల ఖరారు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని తాళ్ళూరుకు చెందిన పలు దేవస్థానాలకు ఛైర్మన్ల అభ్యర్థులను ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ఖరారు చేశారు. బుధవారం జగ్గంపేట టిడిపి కార్యాలయంలో ఇటీవల ఎస్ఎంసిలకు ఎన్నికైన పలువురు ఛైర్మన్లు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎను శాలువాలతో, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. అనంతరం తాళ్లూరు వెంకటేశ్వర స్వామి దేవస్థానం(జియ్యన్న స్వామి) దేవాలయానికి ఛైర్మన్‌గా అభ్యర్థిగా దాపర్తి సీతారామయ్య, తాళ్లూరు రామలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ అభ్యర్థిగా వెంకట వీరవెంకటసత్యనారాయణలను ప్రతిపాదిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఎస్ఎంసి ఛైర్మన్లు జీరి సత్తిబాబు, మలిరెడ్డి చంద్రశేఖర్, బూర కళ్యాణిలతోపాటు, నూతనంగా ఎంపికైన దేవస్థానం ఛైర్మన్లను ఎంఎల్ఎ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శీలామంతుల వీరబాబు, నాయకులు మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, పాలచర్ల గోపాలకృష్ణ, ముండ్రు శ్రీనివాసరావు, కోండ్రు అప్పలరాజు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట 31వ వార్డు కౌన్సిలర్ పాగా సురేష్ కుమార్ పుట్టిన రోజు వేడుకలు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక భాస్కర్ కాలనీ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పలువురు పారిశుధ్య కార్మికులను సత్కరించి, దుస్తులను అందచేశారు. అనంతరం ఎస్‌కె బాయ్స్ ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను పాగా సురేష్ కుమార్ కట్ చేశారు. పట్టణ పరిధిలోని పలువురు నాయకులు సురేష్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.